# ప్రజాశక్తి

మంగళవారం 17 జూన్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

# ప్రపంచ రికార్డు సాధనే లక్ష్యం

◆ 21న విశాఖలో 5 లక్షలు.. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది యోగాసనాలు

◆ క్షేత్ర స్థాయి సమీక్షా సమావేశంలో సిఎం చంద్రబాబు ◆ నగరంలో యోగా డే ఏర్పాట్ల పరిశీలన

ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఈ నెల 21న విశాఖలో తలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ప్రపంచ రికార్డు సాధనే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొనే ఈ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు సోమవారం విశాఖ వచ్చిన చంద్రబాబు ఆర్‌కె బీచ్ నుంచి రుషికొండ సమీపంలోని గీతం యూనివర్సిటీ వరకూ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం ఆంధ్రా యూనివర్శిటీ క్యాంపస్ మైదానంలో చేసిన ఏర్పాట్లనూ పరిశీలించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ యోగా డే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఏ విధంగా చేస్తున్నారనే అంశంపై అధికారుల నుంచి సమాచారం తీసుకున్నారు. యోగా డేను ప్రపంచ రికార్డు సాధించేలా నిర్వహించేందుకు అవసరమైన అంశాలపై దిశా నిర్దేశం చేశారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

**యోగా డే డిక్లరేషన్ చేద్దాం**

యోగా డే నిర్వహణపై నిర్వహించిన అత్యున్నత స్థాయి సమీక్షలో సిఎం మాట్లాడుతూ.. 'ఇంటర్నేషనల్ యోగా డే డిక్లరేషన్‌ను విశాఖ వేదికగా చేద్దాం. యోగా నిత్య జీవితంలో భాగంగా మారేలా కృషి చేద్దాం. విశాఖలో చారిత్రక వేడుకకు నాంది పలుకుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది వరకు యోగా డేలో మిగతా 2లో..

వార్త 5లో..

అనకాపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

## సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని..

# అంగన్‌వాడీల ధర్నాలు

## జివిఎంసి కమిషనర్‌గా కేతన్ గార్గ్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) నూతన కమిషనర్‌గా 2018 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన కేతన్ గార్గ్‌ను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కేతన్ గార్గ్ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో జివిఎంసి కమిషనర్‌గా విధులు నిర్వహించిన పి.సంపత్ కుమార్ ఈ ఏడాది జనవరి 20న బదిలీ కావడంతో మిగతా 2లో..

## జివిఎంసి పాఠశాల మూసివేతకు యత్నం

▶ వార్త 4లో..

## అటవీ భూములకు సాగుహక్కు పట్టాలివ్వాలి

▶ వార్త 8లో..

## కలుషిత ఆహార బాధితులకు పరామర్శ

▶ వార్త 8లో..

అవార్డులతో పోర్టు అధికారులు

## విశాఖ పోర్టుకు రెండు ప్రతిష్టాత్మక అవార్డులు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖపట్నం పోర్టు అథారిటీకి ఢిల్లీలో జరిగిన 11వ వార్షిక గ్రీన్‌టెక్ సిఎస్ఆర్ అవార్డ్స్ - 2025 కార్యక్రమంలో రెండు ప్రతిష్టాత్మక అవార్డులు దక్కాయి. ఈ విషయాన్ని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ మీడియాకు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి విభాగాలలో విశాఖపట్నం పోర్టు అథారిటీ చేపట్టిన విశిష్టమైన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. గ్రీన్‌టెక్ ఫౌండేషన్ ప్రతి సంవత్సరం పది విభాగాల్లో అత్యుత్తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమాలు మిగతా 2లో..

# ఉక్కు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

◆ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి డిమాండ్

◆ జగదాంబ జంక్షన్‌లో నిరసన

నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నాయకులు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్భంధం ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు డిమాండ్ చేసారు. ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు మద్దతుగా సోమవారం సాయంత్రం జగదాంబ జంక్షన్‌లో విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామన్న రాష్ట్ర కూటమి ప్రభుత్వ పెద్దలు కార్మికుల ఉపాధినే కాపాడలేకపోయారని విమర్శించారు. 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నడస్తున్న స్టీల్‌ప్లాంట్‌కు అదనంగా ఆరు వేల మంది కార్మికుల అవసరం ఉన్నప్పటికీ పనిలో ఉన్న 4500 మంది కార్మికులను అక్రమంగా తొలగించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. కార్మికులు తమ ఉపాధి రక్షణ కోసం పోరాడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్షపూరితంగా వ్యవహరించి పోలీసులతోనూ, బెదిరింపులతోనూ ఉద్యమాన్ని అణిచివేయడాన్ని కార్మికవర్గం ముక్తకంఠంతో ఖండించిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం వంటి డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించినా ప్రజలు, కార్మికులు స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం పోరాడుతున్నారని గుర్తు చేశారు. 21న ప్రధాని మోడీ విశాఖకు యోగా చేయడానికి వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర మిగతా 2లో..

**మొదటి పేజీ తరువాయి..**

యోగా వేదికలు ఎక్కడెక్కడ ఉన్నాయో సిఎంకు తెలియజేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

## ప్రపంచ రికార్డు సాధనే లక్ష్యం

పాల్గొంటారని అంచనా వేస్తున్నాం. 5 లక్షల మందితో యోగా చేయడానికి విశాఖ వేదికకానుంది' అని చెప్పుకొచ్చారు. ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు యోగా డే నిర్వహణకు అనువైన ప్రాంతమన్నారు. దేశంలో ఇలాంటి ప్రదేశం మరెక్కడా లేదన్నారు. యోగా డే నిర్వహణకు సంబంధించి భారతీయ నౌకాదళం కూడా 11 నౌకలను ఆర్కే బీచ్ సమీపంలో ప్రదర్శించనుందని వెల్లడించారు. ప్రజా ఉద్యమంగా యోగాను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు యోగా అవసరమన్నారు. 326 కంపార్టుమెంట్లల్లో యోగాసనాలు వేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు.

**రోజంతా విస్తృత పర్యటన**

సోమవారం విశాఖకు చేరుకున్న చంద్రబాబు అంతర్జాతీయ యోగా డే నిర్వహించే వేదికైన ఆర్కె బీచ్‌లో తొలుత ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. వేదిక వద్ద చేయాల్సిన పనులపై పలు సూచనలు చేశారు. ఆ తర్వాత ఆర్కే బీచ్ నుంచి రుషికొండ సమీపంలోని గీతం యూనివర్సిటీ వరకూ బీచ్ రోడ్డులో ప్రయాణించి పరిశీలన చేశారు. అటు ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో చేసిన ఏర్పాట్లను కూడా సిఎం సమీక్షించారు. విశాఖ ఆర్కే బీచ్ వేదికగా ఐదు లక్షల మంది యోగా డేలో హాజరయ్యేలా చేస్తున్న ఏర్పాట్లను ముఖ్యమంత్రి స్వయంగా సమీక్షించారు. యోగా డే కోసం చేసిన ఏర్పాట్లను, ప్రధాని పర్యటనకు సంబంధించిన అంశాలను యోగాంధ్ర - 2025 నోడల్ అధికారి ఎమ్.టి.కృష్ణబాబు సిఎంకు వివరించారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకూ బీచ్ రోడ్ వెంబడి వివిధ ప్రాంతాల్లో చేసిన ఏర్పాట్లను విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వివరించారు. అంతర్జాతీయ యోగా డేలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చూసుకోవాలని సిఎం సూచించారు. సిఎం వెంట స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు నారా లోకేష్, నారాయణ, కందుల దుర్గేష్, డోలా బాల వీరాంజనేయ స్వామి, పార్థసారథి, అనిత, గుమ్మడి సంధ్యారాణి, తదితరులు ఉన్నారు.

## జివిఎంసి కమిషనర్‌గా కేతన్ గార్గ్

అప్పటినుండి కమిషనర్ స్థానం ఖాళీగా ఉంది. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఇప్పటి వరకు జివిఎంసి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపడుతూ వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు ఐదు నెలల తర్వాత జివిఎంసికి పూర్తి స్థాయి కమిషనర్‌ను నియమించింది.

## ఉక్కు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రభుత్వం కార్మికుల ఉపాధి రక్షణ, ప్లాంట్ రక్షణపై ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఎపిఎఫ్‌టియు నాయకులు కె.దేవా, సిఐటియు నాయకులు పి.వెంకటరెడ్డి, పి.మణి, ఎం.సుబ్బారావు, పి.వెంకటరావు, వి.నరేంద్రకుమార్, ఎఐటియుసి నాయకులు ఎస్‌కె.రెహమాన్, కె.సత్యన్నారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు డి.వెంకటరమణ, డివైఎఫ్ఐ నాయకులు డి.ఉమా శైలజ తదితరులు పాల్గొన్నారు.

**ముఠా కార్మికుల నిరసన**

స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపాలని, ప్రైవేటీకరణ చేయటం లేదని ఈ నెల 21న విశాఖ వస్తున్న ప్రధాని మోడీ ప్రకటించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పూర్ణా మార్కెట్ స్ప్రింగ్ రోడ్డులో ముఠా కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కుర్మన్నపాలెం జంక్షన్ దగ్గర ఉన్న దీక్షా శిబిరంపై టిడిపి, జనసేన, బిజెపి కూటమి, పోలీసులు నిర్బంధం ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

## విశాఖ పోర్టుకు రెండు ప్రతిష్టాత్మక అవార్డులు

నిర్వహిస్తున్న సంస్థలకు ఈ అవార్డులు ప్రదానం చేస్తోంది. ఆధునికమైన, సమర్థవంతమైన సామాజిక అభివృద్ధికి పోర్టు సిఎస్ఆర్ కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తోంది. ముఖ్యంగా ఆదివాసీ, సామాజికంగా వెనుకబడిన తరగతుల కోసం చేపట్టిన కార్యక్రమాలు ప్రత్యేకంగా నిలిచాయి. ఆరోగ్య సంరక్షణ ప్రోత్సాహంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలకు ఆర్థిక సహాయం అందించడం, లయన్స్ కేన్సర్ అండ్ జనరల్ హాస్పిటల్‌లో పర్యావరణ నిర్వహణ సదుపాయాల కల్పనకు చేయూతనివ్వడం, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మిడ్డే మీల్స్ నిధులు అందించడం వంటి చర్యలు చేపట్టింది. నైపుణ్యాభివృద్ధి విభాగంలో స్థానిక యువతకు సహాయపడింది. మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగాల కోసం శిక్షణ కార్యక్రమాలు చేపట్టింది. ఇవన్నీ గ్రీన్ టెక్ అవార్డుల్లో విశాఖపట్నం పోర్టును విజేతగా నిలిపాయి. ఈ విజయం పట్ల పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు సంతోషం వ్యక్తం చేశారు. విజయానికి కారకులైన ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు. సామాజికపరంగా సమగ్రాభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

# యోగా డే నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఈ నెల 21న బీచ్ రోడ్డు ప్రధాన వేదికగా జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆ ప్రాంతానికి చుట్టుపక్కల ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ నగర పోలీస్ కమిషనర్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రధాన వేదికకు చేరుకునే వారికి ఎపిఐఐసి మైదానంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. అదే విధంగా ఈ నెల 17వ తేదీ నుండి 21 వరకు ఎన్‌టిఆర్ సర్కిల్ నుండి పార్క్ హోటల్ వరకు పూర్తిగా మార్గాన్ని మూసివేయనున్నారు. పార్క్ హోటల్ నుండి భీమిలి బీచ్ వరకు ఈ నెల 19 నుండి 21 వరకు రెండు రోజులపాటు బీచ్ రోడ్‌ను భద్రతా కారణాల దృష్ట్యా మూసివేయనున్నారు.

బీచ్ రోడ్డులో ఇప్పటికే మోహరించిన పోలీసులు

**పార్కింగ్ స్థలాలు ఇవే**

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు వచ్చే అతిథులు, ప్రజల కోసం ఆలిండియా రేడియో సమీపంలోని ఎపిఐఐసి గ్రౌండ్, ఏయూ భాస్కర్ హాస్టల్‌లో పార్కింగ్ సదుపాయం కల్పించారు. శ్రీకాకుళం నుంచి వచ్చేవారికి శ్రీకాకుళం, భోగాపురం, తగరపువలస, చిలకపేట, భీమిలి ప్రాంతాలలోను, విజయనగరం నుండి వచ్చే వారికి తగరపువలస, బోయపాలెం బీచ్ రోడ్ ప్రాంతాల్లోనూ, అనకాపల్లి నుండి వచ్చే వారికి అనకాపల్లి, పెందుర్తి, వేపగుంట, అడవివరం, హనుమంతవాక, ఎండాడ ప్రాంతాల్లోనూ, అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి వచ్చే వారికి పెందుర్తి, వేపగుంట, హనుమంతువాక, ఎంవిపి డబుల్ రోడ్డు ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. అదేవిధంగా 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుండి నగరంలోకి భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. వాటిని ఆనందపురం ఫ్లైఓవర్ మీదుగా మళ్లించనున్నారు. ఈ నెల 21వ తేదీ ఉదయం రెండు గంటల నుండి 11 గంటల వరకు యోగ దినోత్సవ వేడుకల్లో పాల్గొనే వారికి తప్ప మరెవరికీ బీచ్ రోడ్డు ప్రాంతానికి ప్రవేశం లేదు.

బహుమతులతో కిడ్స్ గార్డెన్ విద్యార్థులు

# సత్తా చాటిన కిడ్స్ గార్డెన్ విద్యార్థులు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** కిడ్స్ గార్డెన్ పబ్లిక్ స్కూల్ (ఆర్యూ వ్యాలీ స్కూల్) విద్యార్థులు తెలంగాణలో తమ సత్తా చాటారు. విశాఖ ఎంవిపి.కాలనీ ఉషోదయ జంక్షన్ వద్ద ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాయి లక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ స్కూలు విద్యార్థులు అన్ని రంగాలలో అద్భుత ప్రతిభ కనబరుస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. ముఖ్యంగా కళ్లకు గంతలు కట్టుకొని సిక్స్త్ సెన్స్ ద్వారా రంగులను గుర్తించడం, అలాగే మైండ్ పవర్ ద్వారా ఏడాది అంతా చదివే పుస్తకాన్ని ఒకరోజు చదివి గుర్తుపెట్టుకోవడం వంటి ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తూ పలువురిని సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ రవీంద్ర భారతిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకల సందర్భంగా వేదికపై కిడ్స్ గార్డెన్ పబ్లిక్ స్కూల్ (ఆర్యూ వ్యాలీ స్కూల్) విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాయి లక్ష్మి తమ విద్యార్థులతో పాల్గొన్నారు. ఆ వేదికపై స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రత్యేక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేదిక ప్రాంగణమంతా చప్పట్లతో మార్మోగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాయి లక్ష్మిని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, అలాగే మెమొంటోలను అతిథులు చేతుల మీదుగా అందజేసింది.

## మందులు సిద్ధంగా ఉంచాలి

**ప్రజాశక్తి-విఆర్.పురం :** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ రోగాలకు ముందుస్తుగా మందులు సిద్ధం చేసి ఉంచాలని ఎంపిపి కారం లక్ష్మి సూచించారు. మండలంలోని రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఎంపీపీ, సిపిఎం నాయకులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి, సిబ్బందితో మాట్లాడారు. గోదావరి వరదల సమయం సమీపిస్తున్న కారణంగా అన్ని రకాల రక్తపరీక్షలు సంబంధిత సామాగ్రి అందుబాటులో ఉండేటట్లు చూడాలన్నారు. రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, చినమట్టపల్లి ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్, మండల కమిటీ సభ్యులు పోడియం శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT: VISAKHAPATNAM
E.P.231/2023 in O.S.178/2023
**Between:**
G. Kumari Sridevi ...D.Hr/Plaintiff
**And:**
Anitha ...J.Dr/Defenant
**NOTICE**
To, **The JDR:**
**Bugatha Anitha,**
W/o. Kishore, Hindu,
aged 59 years, R/at D.No. 4-40,
Sundar Nagar,
Near Old Dairy Farm,
Visakhapatnam.
Please take notice the above E.P. filed by the D.Hr Under Order XXI Rules 64 to 66 of C.P.C. and the Hon'ble Court was pleased to order notice to the J.Dr under Order 21 Rule 64 of C.P.C through this publication. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **23-06-2025** at **10:30 A.M.,** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
**K. MADHUSUDHANA RAO,**
Advocate
Visakhapatnam-16,
Cell: 998012912.

# మౌలిక సదుపాయాల కోసం ధర్నా

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** జివిఎంసి 97వ వార్డు పరిధి చినముషిడివాడలోని బర్డన్ నగర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, ఆర్.శ్రీనివాస్, ఎం.మన్మథరావు, ఎన్.నాగభూషణం, వనజాక్షి, కె.సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు. అనంతరం డిఆర్‌ఒ మోహన్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు.

ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

# దర్జాగా కబ్జాలు

ప్రభుత్వ భూమిలో నిర్మించిన రేకుల షెడ్డు

- సర్వే నెంబరు 26, 27లో ఆక్రమణలు, పక్కా నిర్మాణాలు
- ప్రభుత్వ స్థలంలో బోరు వేసి మరో కబ్జాకు సన్నాహాలు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు శివారు ప్రాంతం ఆక్రమణదారులకు సిరులు కురిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేసి, పక్కా నిర్మాణాలు చేపడుతున్నా, ప్రభుత్వ స్థలంలో దర్జాగా బోరు వేసి మరో భారీ కబ్జాకు సన్నాహాలు చేస్తున్నా ఇటు రెవెన్యూ, అటు జివిఎంసి అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో కబ్జారాయుళ్ల అడ్డూఅదుపూ లేకుండా చెలరేగిపోతున్నారు. వార్డు పరిధి రామకృష్ణాపురంలో మొదట పశువుల మేతకోసం గడ్డి కుప్పలు వేసుకొని, ఆ తరువాత పక్కాగా రేకుల షెడ్లు నిర్మించేసుకున్నారు. కాలనీ పెద్దలు అని చెప్పుకునే కొంత మంది వ్యక్తుల అండదండలతోనే ఈ కబ్జాల పర్వం కొనసాగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో రూ.లక్షల్లో చేతులు మారాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే రేకుల షెడ్డు ఎదురుగా ప్రభుత్వ స్థలంలో పశువుల కోసం చుట్టూ బౌండరీ వేసుకొని ఓ వ్యక్తి పశువులను సాకుతున్నాడు. అదే స్థలంలో దర్జాగా ప్రయివేటు బోరు వేసుకొని వాడుకుంటున్నాడు. ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా బోర్లు వేసుకున్నా అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. భవిష్యత్తులో ఈ స్థలం కూడా కబ్జాకు గురై, శాశ్వత నిర్మాణాలు చేపట్టే అవకాశాలు ఉన్నాయని స్థానికులు అంటున్నారు. ఇదంతా అక్కడ పెద్దలే వెనుకుండి నడిపిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందు కబ్జా చేయడం, తర్వాత పక్కా నిర్మాణం చేపట్టడం, రూ. లక్షలు వసూలు చేయడం ఇక్కడ పరిపాటిగా మారిపోయింది. ఎవరైనా అడిగితే ఆయనకు ఇళ్లు లేదు, పేదవాడు అని చెప్పడం స్థానిక పెద్దలకు అలవాటుగా మారిపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కబ్జాదారుల ఆగడాలకు కళ్లెం వేయాలని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని స్థానికులు కోరుకుంటున్నారు.

## నేరాలు ఘోరాలు

### అనంతవరం బస్టాండ్‌లో శిశువు కలకలం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం సిర్లపాలెం సమీపంలోని అనంతవరం బస్టాండ్ వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఓ శిశువును వదిలివెళ్లడంతో కలకలం సృష్టించింది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. సుమారు నాలుగు నుండి ఏడు రోజులు వయసున్న మగ శిశువును ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో అనంతవరం బస్టాండ్‌లో వదిలివేశారు. అక్కడ ఉన్న కిరాణా దుకాణం నిర్వహిస్తున్న రంగుల సత్యవతి ఆ సమయంలో బాలుడిని గమనించింది. వెంటనే శిశువును తీసుకొని తన వద్ద ఉంచుకున్న ఆమె, సోమవారం తెల్లవారుజామున పాలుకని సిర్లపాలెం గ్రామానికి వెళ్లి కోరాడ వరానికి సమాచారం అందించింది. వరం, భర్త నారాయణరావుతో కలిసి స్థానిక పోలీసులను సంప్రదించారు. సమాచారం అందుకున్న ఆనందపురం పోలీసులు, శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలిసి సిర్లపాలెం చేరుకుని శిశువును అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శిశువును వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

దర్యాప్తు చేపట్టిన పోలీసులు శిశువుకు సంబంధించి వివరాలు సేకరించారు. విచారణలో విజయనగరం జిల్లాలోని బాబా మెట్ట ప్రాంతానికి చెందిన వారుగా గుర్తించారు. వివాహేతర సంబంధం ద్వారా శిశువుకు జన్మనిచ్చిన వారు సమాజ భయంతో బస్టాండ్ వద్ద వదిలేసినట్లు అంగీకరించారని పోలీసులు పేర్కొన్నారు. ప్రస్తుతం శిశువు శిశు సంక్షేమ శాఖ అదుపులో ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### విశాఖ డెయిరీలో సీసా పేలి మహిళకు గాయాలు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ కర్మాగారం ఎస్ఎఫ్‌ఎంలో సోమవారం బాదం మిల్క్ సీసా పేలి మహిళకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మాకవరపాలెం చెందిన ఎల్.రాము (45) తీవ్ర గాయాలు పాలైంది. ప్రస్తుతం ఆమె షీలా నగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. బాదం మిల్క్ సీసాల్లో బాదంపాలు అత్యధిక ఉష్ణోగ్రతలో వేడి చేసి నింపే క్రమంలో గాజుసీసా పేలి ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖ డెయిరీ యాజమాన్యం తీసుకున్న అనుచిత నిర్ణయం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 450 మంది కాంట్రాక్టు కార్మికులను విధులకు రాకుండా యాజమాన్యం నిలుపుదల చేసి, వారి స్థానంలో కొత్తవారిని తీసుకొచ్చిందని, ఆ పనిలో అనుభవం లేని కారణంగా మహిళా కార్మికురాలు ప్రమాదానికి గురైందని కార్మికులు చెబుతున్నారు. దీనికి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని పలువురు డిమాండ్‌చేస్తున్నారు.

### రేపు ముర్రా జాతి ఆబోతుల వేలం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎపిఎల్‌డిఎ) నిర్వహణలోని ఫ్రోజన్ సీమెన్ బుల్ స్టేషన్‌లో ఉన్న నాలుగు ముర్రా జాతికి చెందిన ఆబోతులను వేలం వేయనున్నట్టు ఫ్రోజన్ సీమెన్ బుల్ స్టేషన్ ఉప సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. పాతడైరీఫారం సమీపంలో ఉన్న ఫ్రోజన్ సీమెన్ బుల్ స్టేషన్లో ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి వేలం వేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని మంచి నాణ్యత కలిగిన ముర్రా జాతి ఆబోతులను సులభంగా సొంతం చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈ వేలం పాటలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 8142728872 నెంబరును సంప్రదించాలని సూచించారు.

### వాకర్స్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-మధురవాడ : పిఎం పాలెం వాకర్స్ 2020 చేపడుతున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ భాస్కర్ పేర్కొన్నారు. పిఎం.పాలెం బ్రిడ్జ్ అండ్ బ్లెస్ పార్టీ లాంజ్‌లో జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ మధురవాడ నూతన కార్యవర్గాన్ని సోమవారం వాకర్స్ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఇటీవల మాజీ రాష్ట్రపతి జ్ఞానీజైల్ సింగ్ అవార్డు గ్రహీత, సీనియర్ జర్నలిస్ట్ బసనబోయిన ఆనందరావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఐ భాస్కర్ హాజరై మాట్లాడుతూ విధి నిర్వహణలో జర్నలిస్టులు వాస్తవాలకు అండగా నిలబడాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ 2020 వ్యవస్థాపక అధ్యక్షులు శేఖర్, సభ్యులు ముకుంద బాబ్జి, త్రివిక్రమ్, గంధం రాజు, మధురవాడ మీడియా సంఘం ప్రతినిధులు బొల్లు కృష్ణారావు, ప్రతాప్, మజ్జడ శ్రీను, సత్యనారాయణ, సురేష్ కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తగా సింహాచలం

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఎయు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తగా చిత్రకళ విభాగాధిపతి డి.సింహాచలం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్ఎస్ఎస్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు. డి.సింహాచలానికి ఆచార్యులు, ఉద్యోగులు, శుభాకాంక్షలు తెలిపారు.

# నిబంధనలతో ఇక్కట్లు

## 'తల్లికి వందనం' కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న తల్లులు

ప్రజాశక్తి-ఆనందపురం : పాఠశాలలు ప్రారంభమైన వేళ విద్యార్థుల తల్లులకు ఇచ్చే 'తల్లికి వందనం' పథకం కోసం తల్లులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సచివాలయాలు, విద్యుత్ కార్యాలయాలు తల్లుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. పథకంలో తమ పేర్లు లేనందుకు కారణాలు చెప్పాలని అధికారులను సంప్రదిస్తే, విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉందని, బిల్లులు సమర్పించాలని చెప్పడంతో తల్లులు మధురవాడ సబ్‌స్టేషన్‌కు పరుగులు తీసే పరిస్థితి ఏర్పడింది. కొందరికి వాహనాలు ఉన్నట్లు, అధిక ఆదాయం ఉన్నట్లు, ఇంటిలో ఇతరులకు స్కాలర్‌షిప్ లేదా రీయింబర్స్‌మెంట్ పొందుతున్నారని తదితర కారణాలను చూపుతున్నారు. నూతన ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఈ పథకాన్ని అందరికీ అందించాలని ప్రకటించినప్పటికీ, ఇప్పుడది గత ప్రభుత్వ నిబంధనల కన్నా కఠినంగా మారిందని ప్రజలు అంటున్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానంగా ఉన్న ఈ పథకం, అమలులో మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తల్లులు వాపోతున్నారు. మండల స్థాయిలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేసి తల్లికి వందనం పథకం అమలులో సమస్యలు, అనర్హతల వెనుక ఉన్న కారణాలను తెల్పాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ఉక్కు ఉద్యమంపై నిర్బంధం ఆపాలి

ప్రజాశక్తి -తగరపువలస : తొలగించిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన సోమవారం స్థానిక హైవే వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జోన్ కమిటీ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో ఖాళీగా ఉన్న 6 వేల పోస్టులను భర్తీ చేయాలని, ఉక్కు ఉద్యమంపై పోలీసు నిర్బంధం నిలిపివేయాలని, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులపై ఇటీవల పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, ప్రధాని విశాఖ పర్యటన నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించి స్టీల్‌ప్లాంట్ సమస్యలపై ప్రకటన చేయించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ కమిటీ ఉపాధ్యక్షులు ఎస్.అప్పలనాయుడు, పంపాన సూర్యనారాయణ, దామోదర బాబాజీ, జోగ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలసలో రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు

### 140 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు గ్రామ సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 140 మందికి వైద్యులు ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు చేశారు. విశాఖ శ్రీ సత్య సాయి సేవా సంస్థ అధ్వర్యాన శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ సహకారంతో డాక్టర్ గౌతమి, సిబ్బంది కలిసి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 40 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవా సమితి జిల్లా జోనల్ కో-ఆర్డినేటర్ ఎంవి.సత్యసాయి కుమార్, శంకర్ ఫౌండేషన్ సిబ్బంది వై.పైడిరాజు, స్థానికులు పూసర్ల రామారావు, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### 20లోగా ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : అన్నదాత సుఖీభవ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులు ఈ నెల 20వ తేదీలోగా రైతు సేవా కేంద్రంలో ఇకెవైసి చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్ తెలిపారు. ఈ పథకం కింద పద్మనాభం మండలంలో 6,417 మంది, ఆనందపురం మండలంలో 4,772 మంది, భీమిలిలో 3,286 మంది, పెద గంట్యాడలో 256 మంది లబ్ధిదారులుగా ఎంపికయ్యారని తెలిపారు.

### పీజీ పరీక్షల డీన్‌గా ఆచార్య మునిస్వామి

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరీక్షల విభాగంలో పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల డీన్‌గా ఆచార్య బి.మునిస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్ నుండి నియామక ఉత్తర్వులను ఆచార్య మునిస్వామి అందుకున్నారు. అనంతరం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను విశ్వవిద్యాలయ ఆచార్యులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

# సంగీత విద్వాన్ ఆకెళ్ల జయంతి

సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థినులతో ఆకెళ్ల నరసింహస్వామి తదితరులు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి సంగివలసలో సంగీత విద్వాన్ ఆకెళ్ల మల్లికార్జునశర్మ 87వ జయంతి, శ్రీ గురు రాజా మ్యూజిక్ ఇనిస్టిట్యూట్ 11వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ గురు రాజా మ్యూజిక్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు విజినిగిరి సంతోష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు గీతాలు, కీర్తనలు ఆలపించారు. ముఖ్య అతిథులుగా హాజరైన గాత్ర విద్వాంసులు ఆకెళ్ల నరసింహస్వామి, అతని మనవడు నిరంజన్‌ను సన్మానించారు. వారి చేతుల మీదుగా ఇనిస్టిట్యూట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు సంతోష్ కుమార్ కుటుంబ సభ్యులు, మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

# జివిఎంసి పాఠశాల మూసివేతకు యత్నం

## ఆందోళనకు దిగిన విద్యార్థులు, తల్లిదండ్రులు

ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉపాధ్యాయులు తగినంత మంది లేరని కంచరపాలెం మెట్టు వద్ద ఉన్న జివిఎంసి ప్రాథమిక పాఠశాలను మూసి వేయడానికి ప్రయత్నించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. బిఆర్‌టిఎస్ రోడ్డులో సోమవారం రాస్తారోకో చేపట్టారు. దీనికి సంబంధించి తల్లిదండ్రులు చెప్పిన వివరాలిలావున్నాయి... కంచరపాలెం మెట్టు, బ్రిడ్జి పక్కన జివిఎంసి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. సమీపంలోని పైడితల్లమ్మ గుడి వద్ద గల కె.కాలనీ పోర్డు పాఠశాలను కొద్ది సంవత్సరాల క్రితం మూసివేసి, మెట్టు వద్ద గల జివిఎంసి పాఠశాలల పక్కన నెలకొల్పారు. ప్రస్తుత జివిఎంసి ప్రాథమిక పాఠశాలలో గతంలో 11 మంది ఉపాధ్యాయులు ఉండగా, ప్రస్తుతం ఇద్దరే ఉన్నారు. మిగిలిన 9 మందిని అక్కడి నుండి బదిలీ చేశారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులకు సంబంధించి 200కు పైగా బాలబాలికలు ఉన్నారు. ఈ తరుణంలో సోమవారం ప్రాథమిక పాఠశాలను తెరవలేదు. పాఠశాల మూసివేసి ఉండడాన్ని గమనించిన తల్లిదండ్రులు అక్కడికి చేరుకున్నారు. పక్కన ఏర్పాటు చేసిన పోర్ట్ స్కూలుకు విద్యార్థులు అందరూ వెళ్లాలని, వారికి టిసిలు ఇచ్చి పంపిస్తామని, సంతకాలు పెట్టమని ప్రాథమిక పాఠశాల సిబ్బంది కోరడంతో పిల్లలు, తల్లిదండ్రులు దానికి నిరాకరించి ఆందోళనకు దిగారు. జివిఎంసి ప్రాథమిక పాఠశాలను ఎప్పటిలాగే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు కంచరపాలెం మెయిన్ రోడ్డులో రాస్తారోకో చేశారు. దీంతో అక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. సోమవారం ముఖ్యమంత్రి విశాఖ పర్యటనలో ఉన్నారని, సంయమనం పాటించాలని కోరారు. డిఇఒతో మాట్లాడి పాఠశాల తెరిచేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.

క్యాడర్ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

## సూపర్ సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నాం : చంద్రబాబు

ప్రజాశక్తి -మధురవాడ : సూపర్ సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. పోతిన మల్లయ్యపాలెంలో ఉన్న వికన్వెన్షన్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వివిధ అనుబంధ సంస్థల ప్రతినిధులు హాజర్యయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో ఇప్పటికే కొన్నింటిని అమలు చేశామని, మిగిలిన వాటిని కూడా తొందరలోనే అందిస్తామని చెప్పారు. కార్యకర్తల అభివృద్ధిలో పార్టీ వెన్నంటి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బాలవీరాంజనేయులు, గుమ్మడి సంధ్యారాణి, స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

**జర్నలిస్టుల సమస్యలపై వినతి**

గోపాలపట్నం : ముఖ్యమంత్రి చంద్రబాబును జాతీయ జర్నలిస్టు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు విశాఖ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు సంబంధించిన 11 పెండింగ్ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని శ్రీనుబాబు తెలిపారు.

## 'సెయింట్ ఆన్స్'లో సామాజిక చైతన్య కార్యక్రమాలు

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో విద్యార్థినులకు సామాజిక చైతన్య కార్యక్రమాలను రెండు రోజులుగా నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కలను నాటడం, యోగాపై శిక్షణ, పోక్సో చట్టంపై అవగాహన, వ్యక్తిగత పరిశుభ్రత, మానవతా విలువలపై సెమినార్ నిర్వహణ తదితర కార్యక్రమాలను చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కేస్లిన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సిస్టర్ జానీస్, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర నిర్వహణపై నేడు సమావేశం

ప్రజాశక్తి -పద్మనాభం : ఎంపిడిఒ కార్యాలయం సమావేశం మందిరంలో మంగళవారం యోగాంధ్రపై మండల స్థాయి అధికారులతోనూ, ఎంపిటిసిలు, సర్పంచులతో ప్రత్యక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి జ్ఞాన వేణి సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. యోగాంధ్ర నిర్వహణపై మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.

## శ్రీశ్రీకి నివాళి

ప్రజాశక్తి-ఉక్కునగరం : ప్రజానాట్యమండలి స్టీల్ డివిజన్ అధ్యక్షులు ఆర్.కృష్ణార్జున అధ్యక్షతన శ్రీశ్రీ 42వ వర్ధంతిని ఉక్కునగరంలో నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు వైటి.దాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువతరం పోరాట పటిమ పెంచుకోవాలన్నారు. అప్పుడే హక్కులు సాధించుకోగలమన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు జి.సత్యనారాయణ, సత్యసాయి, కోర్లం శ్రీనివాసరావు, నూకరాజు, గౌరీశంకర్, కోటేశ్వరరావు, సువర్ణరాజు, యువి.రమణ, లోకేష్, వరకుమార్, కెటియు.భాస్కర్, అంజి, రాజేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులకు ప్రజానాట్యమండలి స్టీల్ డివిజన్ కళాభినందనలు తెలిపింది.

శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

# నీట్ ర్యాంకర్లకు సత్కారం

అభినందన సభలో మాట్లాడుతున్న ఆకాష్ ప్రతినిధులు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇటీవల విడుదలైన నీట్ 2025 ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన పలువురు విశాఖకు చెందిన విద్యార్థులను ఆకాష్ యాజమాన్యం సత్కరించింది. సోమవారం తమ కార్యాలయంలో నిర్వహించిన అభినందన సభలో నేషనల్ అకాడమిక్ బిజినెస్ హెడ్ ధీరజ్ మిశ్రా మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాదిమంది పోటీపడిన నీట్ -2025 ఫలితాలలో ఆకాశ్ విద్యార్థులు మొదటి 10లో 5 ర్యాంకులను కైవసం చేసుకున్నారని తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో నలుగురు విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులను సొంతం చేసుకొని ప్రతిభ చాటారని పేర్కొన్నారు. విశాఖకు చెందిన విద్యార్థులు ర్యాంకులు సాధించడం ద్వారా వివిధ మెడికల్ కళాశాలలో సీట్లు పొందేందుకు అర్హత సాధించారని వెల్లడించారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉత్తమ ర్యాంకుల సాధనలో తమ సంస్థ ముందంజలో ఉందని చెప్పారు. విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపుతూ ర్యాంకులు సాధించే దిశలో సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ స్టేట్ అకాడమిక్ హెడ్ ఆర్‌విఎస్ఎన్ మూర్తి, రీజనల్ సేల్స్ హెడ్ నిశాంత్ మిశ్రా, అసిస్టెంట్ డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, బ్రాంచ్ మేనేజర్ రాజేష్ ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

# అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : వచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్య శిక్షణ అధికారి ఎం.రమేష్‌నాయుడు సూచించారు. గాజువాకలోని ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువత కోసం అనేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యోగుల రానున్నట్లు చెప్పారు. ప్లేస్‌మెంట్ అధికారి కామేశ్వరరావు మాట్లాడుతూ, ఈ జాబ్ మేళాలో మొత్తం 25 కంపెనీలు పాల్గొన్నాయని, 800 మంది యువకులు హాజరయ్యారని తెలిపారు. 215 మంది అర్హత సాధించినట్లు వివరించారు. కళాశాల కరస్పాండెంట్ వి రామారావు మాట్లాడుతూ, కళాశాల యాజమాన్యం తరచూ జాబ్ మేళా నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణ, ఈశ్వర్‌రాజు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో మాట్లాడుతున్న రామారావు

# విద్యా మిత్ర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-యంత్రాంగం

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పలు పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు.

**భీమునిపట్నం :** భీమిలి మండలం సింగన బంద పంచాయతీ కృష్ణంరాజుపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు శ్యామ్‌సుందర్, ఎస్ఎంసి చైర్మన్ రామలక్ష్మితో కలిసి జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, సర్పంచ్ జివి.నారాయణ విద్యా మిత్ర కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, విశ్రాంత హెచ్ఎం జె.సత్యనారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జివిఎంసి మూడో వార్డు పరిధి కొండ పేట, జివిఎంసి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విద్యా మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.సంజీవ్‌కుమార్, కె.గురుమూర్తి, జె.మురళి, కొక్కిరి అప్పన్న పాల్గొన్నారు.

**ఆనందపురం:** ఆనందపురం గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను సర్పంచ్ చందక లక్ష్మి, సూరిబాబు పంపిణీ చేశారు. కొట్యాడ సత్యమూర్తి ఆర్థిక సహాయంతో విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, చందక సూరిబాబు, ఎఎంసి మాజీ డైరెక్టర్ రెడ్డిబాబు, కోట్యాడ సత్యమూర్తి, స్కూల్ కమిటీ చైర్మన్ బంటుపల్లి లక్ష్మి కంచుబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులను మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సోమవారం పరిశీలించారు. సంజీవయ్య నగర్‌లోని శ్రీ బొక్కే సత్యం కళావేదిక వద్ద, శాంతీనగర్ చిన్న పార్కులలో జరుగుతున్న అభివృద్ధి పనులను, అంబేద్కర్ నగర్ సాయిబాబా ఆలయం పక్క వీధిలో రూ.5.లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ ఉద్యోగి అనూప్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## వాకర్స్ పార్కులో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి -ములగాడ : శ్రీహరిపురం కోరమాండల్ వాకర్స్ పార్కులో మౌలిక వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నామని వాకర్లు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వాకర్స్ పార్కు పారిశ్రామిక ప్రాంత వాసులకు ఉపయోగకరంగా ఉందని తెలిపారు. ఈ పార్కులో రాత్రి సమయాల్లో మందు బాబులు తాగి సీసాలను ఎక్కడికక్కడ పడేస్తుండటంతో ఉదయం వాకింగ్‌కు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరుగుదొడ్ల దుర్వాసన వస్తున్నాయని వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అసాంఘిక కార్యకలాపాలు నిలువరించాలని, పార్కును అభివృద్ధి పరచాలని కోరారు.

## ఆర్థికసాయం

ప్రజాశక్తి-సీతమ్మధార : జాండిస్ సమస్యతో రెండు నెలలుగా బాధపడుతున్న వైసిపి కార్యాలయ పిఆర్ఒ దివాకర్‌ను పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు సోమవారం పరామర్శించి, తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బాణాల శ్రీనివాసరావు, పేడాడ రమణికుమారి, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, వైసిపి నాయకులు సేనాపతి అప్పారావు, పైడి రమణ, నీలి రవి, హరిపట్నాయక్, నాని బాబు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని.. అంగన్‌వాడీల ధర్నాలు

విశాఖలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్**

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పెరిగిన ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచాలని, సాధికార సర్వేలో చూపిస్తున్న ప్రభుత్వ ఉద్యోగి అన్న పదాన్ని తీసివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకురాలు కె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా పేర్కొంటూ సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తకు నెలకు రూ.11,500, హెల్పర్, మినీ వర్కర్‌కు రూ.7 వేలు మాత్రమే గౌరవ వేతనంగా వస్తోందన్నారు. ఇంత తక్కువ వస్తున్నా తమకు తల్లికి వందనం, పెన్షన్, రేషన్ కార్డు, ఇల్లు, ఇంటి స్థలం వంటివి ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి, గౌరవ సలహాదారు బృందావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, కోశాధికారి కె.పద్మావతి, జిల్లా నాయకులు శ్రీదేవి, సత్యవతి, బేగం, శివలక్ష్మి, వెంకటలక్ష్మి, దుర్గ, మాధురి, శ్రీదేవి, సుగుణ, సులోచన పాల్గొన్నారు.

**అనకాపల్లి :** అంగన్వాడీలకు తల్లికి వందనంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అనకాపల్లి కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు మాట్లాడుతూ పేదగర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారని, కాని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు కేవలం గౌరవ వేతనం మాత్రమే ఇస్తున్నారన్నారు. అయినా కూడా తమ పిల్లలకు తల్లికి వందనం, రిటైర్డ్ అయిన వారికి పెన్షన్ రావడం లేదని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ ఉద్యోగులని తిరస్కరిస్తున్నారని తెలిపారు. అంగన్వాడీ వర్కర్లకు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే జీతమైనా ఇవ్వాలని, లేదా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు, లోకేష్ అంగన్వాడీల పోరాటాల వద్దకు వచ్చి అధికారంలోకి రాగానే వేతనాలు పెంచుతామని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కాని నేటికీ అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం దుర్గారాణి, జిల్లా కోశాధికారి వి.రమణమ్మ, తనూజ, కృష్ణవేణి, జయలక్ష్మి, కాసులమ్మ, నారాయణమ్మ, గంగవేణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

**నర్సీపట్నం టౌన్ :** అంగన్వాడీలకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టి, పిజిఆర్ఎస్‌లో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అంగన్వాడీల యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు డి.మహలక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, చాలీచాలని గౌరవవేతనం ఇస్తున్నప్పటికీ అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ళు, ఇళ్లస్థలాలు, తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, అన్నదాత సుఖీభవ వంటి అన్ని పథకాలను దూరం చేశారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు వేతనాలు, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్. రమణమ్మ, వెంకటలక్ష్మి, నాగమణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ఆందోళన చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న తాతయ్యబాబు తదితరులు

## మంత్రి లోకేష్‌ను కలిసిన తాతయ్యబాబు, నాగజగదీష్

**ప్రజాశక్తి-బుచ్చయ్యపేట, అనకాపల్లి రూరల్ :** విశాఖపట్నం పర్యటనకు విచ్చేసిన సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను విశాఖపట్నం విమానాశ్రయంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, పూర్వ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

వినతిపత్రం ఇస్తున్న ఐద్వా నేతలు, మహిళలు

## పలు సమస్యలపై ఐద్వా ధర్నా

**ప్రజాశక్తి-పరవాడ :** పలు సమస్యలపై అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం ఆధ్వర్యంలో సోమవారం పరవాడ ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలు చేయాలని, అర్హులైన వారికి కొత్త పెన్షన్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, పేదలకు ఇల్లులు ఇవ్వాలని కోరారు. బసవతారక రామ నగర్ కాలనీలో చెత్త బండ్లు కల్పించాలని, వీధిలైట్లు వేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రేషన్ డిపో ద్వారా 14 రకాల సరుకులు ఇవ్వాలని, నాణ్యమైన బియ్యం ఇవ్వాలని, మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా గ్రామం ప్రెసిడెంట్ బంగారమ్మ, సెక్రటరీ అన్నపూర్ణ, నాయకులు సంతోషి, సీతామహాలక్ష్మి, అబద్దం సీతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 19న మండల పరిషత్తు సమావేశం

**ప్రజాశక్తి-సబ్బవరం :** మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 19న ఉదయం 10 గంటల నుండి నిర్వహించనున్నట్లు ఎంపిడివో పి.పద్మజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

## సూదివలస- పాతవలస రహదారి అధ్వానం

**ప్రజాశక్తి-కె.కోటపాడు :** మండలంలోని సూదివలస నుండి పాతవలసకు వెళ్లే రహదారి గతుకుల మయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత గుంతలు పెద్దవై ఆ గుంతల్లో నీరు చేరి వాహన చోదకులకు నరకం చూపిస్తున్నాయి. సూదివలస నుండి పాతవలస వరకు సుమారు 1.5 కిలోమీటర్ల దూరం గల రోడ్డుకు మరమ్మతులు లేక వాహన చోదకులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతులు నిర్వహించి ప్రజల కష్టాలను తీర్చాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పెద్ద పెద్ద గోతుల్లో నీరు చేరి చెరువును తలపిస్తున్న దృశ్యం

## కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి-కె.కోటపాడు :** మండల కేంద్రం కె.కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన టైపు ఫోర్ కేజీబీవీ బాలికల హాస్టల్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 30వ తేదీలోగా స్థానిక జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎంకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓలు కే.సత్యనారాయణ, డివిడి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఈ హాస్టల్లో ప్రవేశం పొందుటకు అర్హులని పేర్కొన్నారు. కుల ధ్రువీకరణ పత్రం, సంవత్సర ఆదాయం రూ.1,14,000 లోపు ఆదాయ ధ్రువపత్రం కలిగి ఉండాలన్నారు. అనాధలు, సెమీ అనాధలు, వైకల్యం ఉన్న విద్యార్థినులకు తొలి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. మిగిలిన సీట్లకు రిజర్వేషన్ నియమాన్ని పాటిస్తూ నియోజకవర్గాన్ని ప్రామాణికంగా భర్తీ చేయడం జరుగుతుందని వెల్లడించారు.

## తల్లికి వందనంపై విష ప్రచారం సరికాదు

**ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ :** తల్లికి వందనం పథకం నుండి 2000 చొప్పున నారా లోకేష్ జేబుల్లోకి పోయేయంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణ చేస్తున్నారని, అది సరికాదని టిడిపి జిల్లా అధ్యక్షులు, బత్తుల తాతయ్యబాబు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. కనీసం తల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్ రెడ్డి నేడు తల్లికి వందనం గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వైసీపీ పాలనలో అమ్మఒడి పథకంలో విద్యార్థికి 13000 మాత్రమే ఇచ్చారని తక్కిన 2000 జగన్ జేబుల్లోకి పోయాయా? తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా? అని ప్రశ్నించారు. పట్టణ శాఖ కోశాధికారి పొలిమేర నాయుడు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యపై మహిళల ఆందోళన

**ప్రజాశక్తి -అచ్యుతాపురం :** మండలంలోని మడుతూరు గ్రామ ఎస్సీ కాలనీలో తాగునీరు సరఫరా నిలిచి సమస్యలు ఎదుర్కొంటున్నామని, వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యాన కాలనీకి చెందిన మహిళలు సోమవారం గ్రామ సచివాలయం ఆవరణలో ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. తాగునీటి సమస్యపై విజ్ఞప్తి చేసిన సంబంధిత గ్రామీణ నీటి సరఫరా అధికారులు కనీసం పట్టించుకోలేదన్నారు. దీంతో ప్రతిరోజు దూర ప్రాంతాలకు వెళ్లి వ్యవసాయ పంట భూములలో వ్యవసాయ బోర్ల నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ ఎం.సంజీవ్ సచివాలయ సెక్రటరీ శ్రీనివాసరావు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నేత కె.సోమునాయుడు, కే నాగేశ్వరి, కే శ్రీలత, చెవ్వేటి ఉమామహేశ్వరి, ఆదిలక్ష్మి, సిహెచ్.అమ్మాజీ, కుప్పల వరలక్ష్మి, దేవి, దుర్గ, కోడి పోతురాజు, పాల్గొన్నారు.

## వారం రోజుల్లో వరి విత్తనాల పంపిణీ

**ప్రజాశక్తి - యలమంచిలి :** యలమంచిలి మండలంలో ఖరీఫ్ వరి సాగుకు సంబంధించి వారం రోజుల్లో వరి విత్తనాలు పంపిణీ ప్రారంభిస్తామని మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహనరావు తెలిపారు. సోమవారం తనను కలిసిన ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ చెరకు సాగు క్రమంగా తగ్గిపోవడంతో వరి సాగు పెరిగిందని, 3,500 ఎకరాలుండే వరిసాగు ప్రస్తుతం 5,400 ఎకరాలకు చేరిందని పేర్కొన్నారు. సాగు నీరు మాత్రం కేవలం 2,022 ఎకరాలకు మాత్రమే అందుతోందన్నారు. ఎరువులు 1,150 టన్నుల ఇండెంట్ పెట్టామన్నారు. రెండ్రోజుల క్రితం వాతావరణం చల్లబడ్డంతో వరిదుక్కులు చాలా గ్రామాల్లో ప్రారంభించినట్లు చెప్పారు.

సమస్యలు ఎదుర్కొంటున్న కొందరు రైతులు వరిసాగుకు మొగ్గు చూపడం లేదని, తనకున్న 5 ఎకరాల భూమిలో పెట్టుబడి కూడా తిరిగి రాబట్టుకోలేక పోతున్నానని ఓ రైతు వాపోతున్నారు. గతంలో మండలంలోని తురంగపాలెం, జంపపాలెం ప్రాంతంలో ఎకరాకు రూ.6వేలు కౌలు ఇచ్చేవారని, ఆ తరువాత పంట దిగుబడిలో మూడోవంతు వాటా ఇస్తామని కౌలు రైతులు చెప్పారని, ఇప్పుడు ఎకరాకు మూడు, నాలుగు వేల కంటే ఇవ్వమని చెప్పడంతో వరిసాగును మానుకున్నామని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ రైతు ప్రజాశక్తికి చెప్పారు.

## పిజిఆర్ఎస్‌కు 282 అర్జీలు

**ప్రజాశక్తి-అనకాపల్లి :** స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో 282 అర్జీలు వచ్చాయి. వీటిని ప్రజల నుండి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి స్వీకరించారు. ముందుగా శాఖల వారీగా ఒక్కో శాఖలో పెండింగులో ఉన్న అర్జీలపై కలెక్టర్ విజయ క్రిష్ణన్ సమీక్షించారు. పరిష్కారం కాని అర్జీలపై సమీక్ష నిర్వహించారు. అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. డివిజన్, మండల, గ్రామస్థాయిలలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పక హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా ఎక్సైజ్ అధికారి వి.సుధీర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.మనోరమ, ఎపిఈపిడిసిఎల్ ఎస్ఈ ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 20న వైఎస్ షర్మిల పర్యటన

**ప్రజాశక్తి-అనకాపల్లి :** రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు వైఎస్ షర్మిల ఈనెల 20న జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీసాల సుబ్బన్న తెలిపారు. ఇందుకు సంబంధించిన సన్నాహక సమావేశం ఆయన అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యటన అనంతరం వైఎస్.షర్మిల అనకాపల్లి రోటరీ హాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ షర్మిల పర్యటన విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి, పాయకరావుపేట, మాడుగుల, నర్సీపట్నం, అనకాపల్లి అసెంబ్లీ కోఆర్డినేటర్లు తనకాల అనంతరావు, పడాల కొండలరావు, మారుతి చక్రవర్తి, కచ్చాల చినబాబు, మలపురెడ్డి కోటేశ్వరరావు, నాయకులు బవిన్నకోట రాము, కాళ్ల సత్యనారాయణ, ఆదిమూర్తి, ఆర్ఆర్ నాయుడు, సేనాపతి రాజు, కట్టమూరి నూక అప్పారావు, బోయిన భానుమూర్తి యాదవ్, కెవి మాణిక్యం, బుద్ద కిషోర్, బి.బాల మురళి పాల్గొన్నారు.

## ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ వై.సత్యనారాయణ రావుకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.బాబ్జి, ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేల రూపాయలు దోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

## టీబీ నివారణపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తురకలపూడి పిహెచ్‌సి వైద్య అధికారి డి.సంధ్యారాణి తెలిపారు. సోమవారం తురకలపూడి పిహెచ్‌సి పరిధి సీతయ్యపేటలో టీబీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీడీ, సిగరెట్, పాన్ మసాలా, ఆల్కహాల్ తదితర వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సునీల్ మాధవ్, సూపర్వైజర్ రాజశేఖర్, రమణ, చంద్రమౌళి, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ అయ్యప్ప రెడ్డి, పెంటయ్య పాల్గొన్నారు.

## పాఠశాలలో సైకిల్ స్టాండ్ ప్రారంభం

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక జిల్లా పరిషత్తు పాఠశాలలో 1993 -94 బ్యాచ్‌కు చెందినన పూర్వ విద్యార్థులు నిర్మించిన సైకిల్ స్టాండ్‌ను సోమవారం ప్రారంభించారు. మండలంలోని ఒంపోలు, అరబ్బు పాలెం, వాడ్రాపల్లి తదితర గ్రామాల నుండి సైకిళ్లపై వస్తున్న విద్యార్థుల సౌకర్యార్థం ఈ స్టాండ్ నిర్మాణం చేపట్టినట్లు పూర్వ విద్యార్థి, గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్య చంద్ర రామారావు, పూర్వ విద్యార్థులు ఆడారి గంగ మహేష్, టెక్కలి గంగు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'భూకబ్జాలు చేసింది వైసిపి నేతలే'

ప్రజాశక్తి-అనకాపల్లి : గత వైసిపి పాలనలో ఆ పార్టీ నాయకులే భూకబ్జాలకు పాల్పడ్డారని కూటమి నేతలు ఆరోపించారు. అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రి బాబి మాట్లాడుతూ మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ ఏదో కూటమి నేతలు అక్రమాలు చేసినట్లు, క్వారీలు అక్రమంగా తవ్వుతున్నట్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. నేటి వరకూ కూటమి నాయకులలో ఏ ఒక్కరి పేరు మీదైనా అక్రమ క్వారీ నడుపుతున్నట్లు రుజువు చేస్తే వాటిని రాసిచ్చేస్తామని తెలిపారు. జనసేన పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి దూలం గోపి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో కన్నా తక్కువ మంది లబ్ధిదారులకు తల్లికి వందనం ఇస్తున్నట్లు చెప్పడం సరికాదన్నారు. జనసేన పార్టీ మండల నాయకులు చదరం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏడాది పాలనలో దాదాపు రూ.130 కోట్లు అనకాపల్లి ప్రాంత అభివృద్ధికి తీసుకొచ్చినట్లు చెప్పారు. మామిడిపాలెం సర్పంచ్ పూడి పరదేశీ నాయుడు మాట్లాడుతూ వైసిపి హయాంలో చేసిన అక్రమ క్వారీలకు ఇప్పుడు జరిమానాలు విధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాకవరం సర్పంచ్ నూకరాజు, జనసేన నాయకులు గంగుపాం జగదీష్, బంటు రవి, భరత్ బాబు, కర్రి సత్యనారాయణ, అప్పికొండ గణేష్, మంగా ఈశ్వర్, ఆళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విత్తన దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలోని విత్తన దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి ఎల్‌వై.కాంతమ్మ సోమవారం తనిఖీలు చేశారు. హేమరైతుడిపో, గ్రోమోర్ విత్తన దుకాణాల్లో జరుగుతున్న విత్తనాల విక్రయ ప్రక్రియను పరిశీలించారు. విత్తనాల నాణ్యతను నిర్ధారించేందుకు కొన్ని నమూనాలను సేకరించి, తాడేపల్లిగూడెంలో ఉన్న క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌కు పంపించామని కాంతమ్మ తెలిపారు. విత్తన నాణ్యతపై ఎలాంటి సందేహాలు ఉన్నా రైతులు వాటిని పరీక్షకు పంపించవచ్చని పేర్కొన్నారు. విత్తనాల ధరలు రైతులకు స్పష్టంగా కనిపించేలా షాప్ ముందు ధరల పట్టిక ఉంచాలని, కొనుగోలుదారులకు బిల్లు లేదా రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణాల యజమానులకు సూచించారు.

విత్తనాల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎఒ కాంతమ్మ

# రోడ్డు సౌకర్యం కల్పించాలి

## కలెక్టరేట్ వద్ద కొండవీధి. పెదగొరుగడ్డ గ్రామాల గిరిజనుల ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండలం ఆవురువాడ పంచాయతీ పరిధి కొండవీధి, పెదగొరుగెడ్డ రెండు గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ రెండు గిరిజన గ్రామాలకు రోడ్డులేక గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఈ గ్రామాల్లో 100 కుటుంబాలు 300 మంది జనాభా నివసిస్తున్నట్లు చెప్పారు. వీరనారాయణ నుంచి కొండవీధి, పెద్దగొరుగెడ్డ గ్రామాలకు పడుతూ లేస్తూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వర్షాకాలంలో గర్భిణులను, రోగులను డోలీ మోతలతో ఆసుపత్రికి తీసుకురావాల్సిన దుస్థితి అని పేర్కొన్నారు. వర్షాలు పడినప్పుడల్లా వాగు పొంగుపొర్లితే వీరనారాయణలో చదువుకునే పిల్లలకు వారం, రెండు వారాలు పాఠశాలకు వెళ్లలేని స్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము మౌలిక సదుపాయాలు లేక చదువు కోలేదని, తమ పిల్లల భవిష్యత్తుల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెస్తున్నామని తెలిపారు. పరిష్కారం చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గతంలో ఒక గర్భిణీ స్త్రీ వర్షాకాలంలో డోలీ మోసుకొని వచ్చినప్పుడు వాగు పొంగి పొల్లడంతో గెడ్డ వద్దే ప్రసవించిందని గుర్తు చేశారు. వాగు పొంగితే వారం రోజులు కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. కొండవీధి, పెదగొరుగెడ్డ గ్రామ ప్రజలకు బ్రిడ్జి నిర్మాణం కోసం పనులు ప్రారంభించి అసంపూర్తిగా మధ్యలో నిలుపుదల చేశారని, ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి రోడ్డు ఏర్పాటు చేయాలని, గ్రామానికి తాగునీరు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం గడబరి, మరాజు, సోలం అప్పారావు, సూర్యనారాయణ, సోలం రాజబాబు, తోకల రాజబాబు, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

# సాయి శ్రేయాస్ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం

## సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని, తానాం గ్రామం, జెఎన్ ఫార్మా సిటీ, ప్లాట్ నెంబర్ 61ఎ, రోడ్ నెంబర్ 2 సాయి శ్రేయాస్ ఫార్మా స్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద ఈ నెల 12న మురుగునీటి నిల్వ ట్యాంక్ ప్రమాదం మానవ తప్పిదం వల్ల జరిగిందని కాదని, యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రమాదంలో ఇద్దరు సేఫ్టీ ఇన్‌ఛార్జులు మరణించారని, ఒక కార్మికుడు తీవ్ర అస్వస్థతకి గురయ్యారని తెలిపారు. జరిగిన ప్రమాదాన్ని యాజమాన్యం మానవ తప్పిదంగా మళ్లించాలని భద్రత డొల్లతనాన్ని కప్పిపుచ్చుకోవాలని ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. కనీసం సాల్వెంట్ ట్యాంకర్ వద్ద ఇండికేటర్ కూడా లేకుండా నిర్వహిస్తున్నారన్నారు. పిపిఈ కిట్లు అందుబాటులో ఉంచలేదని, నాణ్యమైన ఆక్సిజన్‌తో కూడిన మాస్కులు ధరించి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని పేర్కొన్నారు. ఈ పరికరాలు ఇవ్వాల్సిన యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, సకాలంలో ఆక్సిజన్, వైద్యం అందించలేదని తెలిపారు. ఈ సంఘటనలో ఆసుపత్రిపాలైన కార్మికుడి నుండి వివరాలు రాబట్టాలని, ఆయన స్టేట్మెంట్ ఆధారంగా సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

## పెట్రోలియం వర్సిటీ నిర్మాణ పనుల్లో

# మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని వంగలి వద్ద ఏర్పాటు చేస్తున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ యూనివర్సిటీ నిర్మాణం పనుల్లో ఈ నెల 9న ఓ భవన నిర్మాణ కార్మికుడు షేక్ ఉమ్మరవల్లి(39) భవనంపై నుండి పడి మృతి చెందాడని, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని సిపిఎం మండల నాయకులు ఉప్పాడ సత్యవతి డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి నష్ట పరిహారంతో పాటు కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. చోడవరం యడ్ల వీధికి చెందిన షేక్ ఉమ్మరవల్లి(39) ఈ నెల 2న వంగలిలో ఐఐపిఈ నిర్మాణ పనులు చేయడానికి వచ్చాడని, ఈ క్రమంలో 9న భవన నిర్మాణ పనులు చేస్తుండగా పై నుండి కింద పడి మృతి చెందారని తెలిపారు. మృతుని కుటుంబానికి కెపిసి కాంట్రాక్టర్ రూ.3 లక్షలు ఇచ్చి పోలీసుల సమక్షంలో ఇన్సూరెన్స్ రూ.15 లక్షలు ఇస్తామని చెప్పి వదిలించుకున్నారని ఆరోపించారు. మృతునికి భార్య షేక్ పాతిమాబీబీ, కుమార్తె షేక్ షాహిదా భేగం, కుమారుడు షేక్ హుస్సేనా ఉన్నారని, అందు వల్ల ఆయన కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం, కుటుంబ సభ్యునికి కెపిసి సంస్థలో ఉపాధి కల్పించాలని సత్యవతి డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి భద్రత, సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? విచారణ చేపట్టాలని, పనుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం చేపడతామని ఆమె హెచ్చరించారు. ఈ విషయంపై స్థానిక సిఐ రామచంద్రరావును వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పశువైద్యాధికారుల బాధ్యతలు స్వీకరణ

అల్ఫోన్స్ జార్జ్

ప్రజాశక్తి-కశింకోట : కసింకోట పశు వైద్యాధికారిగా డాక్టర్ చైతన్యమణి, మండలంలోని నర్సింగబిల్లి పశువైద్యాధికారిగా డాక్టర్ అల్ఫోన్స్ జార్జ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీరికి పశువైద్యశాలల సిబ్బంది అభినందనలు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా వీరి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

చైతన్యమణి

ధర్నా చేస్తున్న రైతులు

## ఇకెవైసి వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-మునగపాక : అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఈకేవైసీని వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్.బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ ఈనెల 19వ తేదీలోగా అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం గడువు విధించడంతో రైతులు రైతు సేవా కేంద్రం చుట్టూ తిరిగిన ఫలితం కనిపించలేదని తెలిపారు. మొక్కుబడిగా ఈకేవైసీ ప్రక్రియ జరుగుతుంది తప్ప పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. సిబ్బంది కార్యాలయం దగ్గర ఎవరూ లేకపోవడం, ఒకవేళ అరకొర సమయాలలో ఈకేవైసీ చేపట్టినా సర్వర్ డౌన్ తదితర కారణాలవల్ల ఈకేవైసీ కుంటుపడుతోందని తెలిపారు. సుఖీభవ పథకానికి వ్యవధి తక్కువ ఉన్నా మండల వ్యవసాయ అధికారి మూడు రోజులుగా కార్యాలయానికి రాకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, ఈకేవైసీని వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు ఆడారి రమణ, కాండ్రేగుల నాయుడు, దాడి సూరిబాబు, బుద్ద రమణ, పెంటకోట చిన్నదాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-పరవాడ : చెట్లు పెంచడం వల్ల పర్యావరణ పరిరక్షణ; కాలుష్యం కాకుండా కాపాడగలుగుతాయని అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా అన్నారు. మండలంలోని రావాడ పంచాయతీ శివారు సోమినాయుడుపాలెం గ్రామంలో శ్రీమరిడిమాంబ, నూకాంబిక ఆలయం ప్రాంగణంలో సోమవారం వియ్యపు చిన్నా సొంత నిధులతో కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బండారు అప్పలనాయుడు, కూండ్రపు సన్యాసిరావు, సిరపురపు అప్పలనాయుడు, బండారు ఈశ్వరరావు, కూండ్రపు కృష్ణ, కూండ్రపు నాయుడు, సిరపురపు నాయుడు, సిరపురపు సోమినాయుడు, సిరపురపు నాయుడు పాల్గొన్నారు.

## టిడిపి అనకాపల్లి టౌన్ సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా వియ్యపు

ప్రజాశక్తి-పరవాడ : టిడిపి అనకాపల్లి టౌన్ సంస్థాగత ఎన్నికల పరిశీలకునిగా పరవాడ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నాను నియమించారు. ఈ మేరకు మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయం నుంచి చిన్నాకు ఆదివారం ఉత్తర్వులు అందాయి. గతంలో మండల తెలుగు యువత అధ్యక్షులుగా, జిల్లా తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిన్నా పనిచేశారు. పార్టీ పటిష్టకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనను నియమించినందుకు చంద్రబాబు, నారా లోకేష్, జిల్లా అధ్యక్షులు తాతయ్య బాబు, నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జి, గండి వంశీలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

## పంచాయతీ కార్యదర్శిని కలిసిన జనసేన నేతలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజేశ్వరరావును సోమవారం జనసేన నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు బంతి కోళ్ల పద్మ, తాటిపాముల శేఖర్, కిల్లి వెంకట సత్యనారాయణ, కొల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వరరావును సత్కరిస్తున్న జనసేన నాయకులు

## ఆదివాసీల సేవలో పోలీసులు

చీరలు పంపిణీ చేస్తున్న డిఎస్‌పి

**ప్రజాశక్తి-గొలుగొండ** :కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా జిల్లా ఎస్‌పి తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు సోమవారం గొలుగొండ మండలం ఏఎల్‌.పురం అల్లూరి పార్క్‌ కొండపై ఉన్న పివిటిజి గిరిజన గ్రామాన్ని డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, నర్సీపట్నం రూరల్‌ సిఐ ఎల్‌.రేవతమ్మ, కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో హోమియో డాక్టర్‌ హేమలత సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తుల కోరిక మేరకు ప్రతి కుటుంబానికి గొడుగులు, మహిళలకు చీరలను, పెద్దలకు పంచెలు, యువతకు వాలీబాల్‌ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనుల వసతి, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల కోరిక మేరకు త్వరలో తాగునీటి కొరకు వాటర్‌ ఫిల్టర్‌ను ఇస్తామని తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి పోలీసుశాఖా పరంగా ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తామని డిఎస్‌పి వెల్లడించారు.

## మండల పరిషత్‌ ఎఒగా మహేశ్వరరావు

ఎఒ మహేశ్వరరావు

**ప్రజాశక్తి-గొలుగొండ** : గొలుగొండ మండల పరిషత్‌ పరిపాలనాధికారిగా ఎ. మహేశ్వర రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. పాడేరు మండల పరిషత్‌ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్‌ ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు స్వాగతించి, శుభాకాంక్షలు తెలిపారు.

# జ్ఞానాపురం హోల్‌సేల్‌ మార్కెట్‌ ఆధునీకీకరణ

### రూ.48 లక్షలతో క్రిస్టియన్‌ శ్మశానవాటికలో సౌకర్యాలు : ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్‌** : దశాబ్దాలగా ఆధునికీకరణకు నోచుకోలేని జ్ఞానాపురంలో హోల్‌సేల్‌ కూరగాయల మార్కెట్‌ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ అన్నారు. సోమవారం జివిఎంసి 41 వ వార్డు పరిధిలో రూ.40.75 లక్షలతో హోల్‌సేల్‌ మార్కెట్‌ మౌలిక వసతులకు రూ.48లక్షలతో జ్ఞానాపురం క్రిస్టియన్‌ శ్మశాన వాటిక, మరుగుదొడ్ల నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోల్‌ సేల్‌ మార్కెట్‌ వర్తకుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. విశాఖ మహానగరంగా అభివృద్ధి చెందిన తరుణంలో పెరిగిన జనాభా మేరకు హోల్‌ సేల్‌ మార్కెట్‌ మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. మార్కెట్‌ను ఇక్కడే ఉంచి, ఆధునికరించడమా, లేదా నగర పరిధిలో మరొక చోట విశాలమైన ప్రదేశాన్ని కేటాయించిఅభివృద్ధిపై ఆలోచన చేస్తున్నామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా వర్తకులు, కార్మికులు, ఏ ఇతర వర్గాలను ఇబ్బందులు పెట్టే ప్రసక్తే లేదన్నారు. జ్ఞానాపురం శ్మశాన వాటిక అభివృద్ధి చర్యల్లో జివిఎంసి నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు కార్యక్రమంలో జివిఎంసి జోనల్‌ కమిషనర్‌ రాము, ఎఇఇ సతీష్‌ హోల్‌ సేల్‌ మార్కెట్‌ వ్యాపారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, క్రిస్టియన్స్‌ శ్మశాన వాటిక నిర్వాహకులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్‌

## అతిసార నివారణపై అవగాహనా ర్యాలీ

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎం అండ్‌ హెచ్‌ఒ జగదీశ్వరరావు

**ప్రజాశక్తి-సీతమ్మధార** : అతిసార వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీని డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్‌ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. 'అతిసారాన్ని ఆపేద్దాం, పరిశుభ్రత పాటిద్దాం- ఒఆర్‌ఎస్‌తో ప్రాణాలు కాపాడుదాం' నినాదంతో ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి సత్యం కూడలి మీదుగా సాగింది. ఐదేళ్ల లోపు చిన్నారులలో డయేరియా మరణాల నిరోధానికి ప్రజలను చైతన్యపరచాలని వైద్యాధికారులకు, క్షేత్ర స్థాయి సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్‌ పి.జగదీశ్వరరావు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్‌ బి.లూసీ కార్డిలియా పిలుపునిచ్చారు. ఏటా వర్షాకాలంలో అతిసార (డయేరియా) కేసులను నియంత్రణలో ఉంచడానికి 'స్టాప్‌ డయేరియా క్యాంపెయిన్‌' పేరున నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ నెల 16 నుండి జులై 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని వివరించారు. బిడ్డకు ఒక రోజులో మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు పలుచగా విరోచనం అయినా, ఏది తిన్నా వాంతి చేసుకోవడం, తల్లి పాలు తాగకపోవడం/ తక్కువగా తాగడం, మలంలో రక్తం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మూర్ఛలు/ఫిట్స్‌ ఉంటే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. విటమిన్‌ ఎ ద్రావణం తాగించడం, స్వచ్ఛమైన తాగునీటిని ఉపయోగించడం, భోజనానికి ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు సబ్బుతో కడుక్కోవడం, మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, అనుబంధ ఆహారం అందించడం, రోటా వైరస్‌ తట్టుకు టీకాలు వేయించడం ద్వారా చిన్నారుల్లో అతిసార మరణాలను అరికట్టవచ్చునని తెలిపారు. డాక్టర్‌ పి.శంకరప్రసాద్‌, జిల్లా ప్రోగ్రాం అధికారులు, పారా మెడికల్‌ సిబ్బంది, ప్రభుత్వ ప్రాంతీయ శిక్షణా కేంద్ర నర్సింగ్‌ విద్యార్థినులు పాల్గొన్నారు.

## మంచినీటి బోరు ప్రారంభం

బోరు ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

**ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్‌** : స్థానిక మున్సిపాలిటీ, రెండో వార్డు బిసి కాలనీలో ఏర్పాటు చేసిన మంచినీటి బోరును టిడిపి వార్డు ఇన్‌చార్జి లాలం మురళీకృష్ణ ప్రారంభించారు. వార్డుపరిధిలో తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడతూ, వేరేచోటుకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సమస్యను స్థానిక స్పీకర్‌ అయ్యన్నపాత్రుడు దృష్టికి స్థానిక కౌన్సిలర్లు, నాయకులు తీసుకెళ్లడంతో బోరు మంజూరు చేశారు. సోమవారం ఆ రు బావిని ప్రారంభించారు. రెండో వార్డు బిసి కాలనీలో తాగునీటి కష్టాలకు విముక్తి లభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, రావణాపల్లి రిజర్వాయర్‌ చైర్మన్‌ రుత్తల రాజేశ్వరరావు, తమ్మినాయుడు, డాబా శ్రీను, గరగా శ్రీను, కన్నూరి శ్రీను,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

**ప్రజాశక్తి- నక్కపల్లి** :ఖరీఫ్‌ సీజన్‌లో రైతులకు సాగుసూచనలు, సలహాలను ఇచ్చేందకు ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్‌ తెలిపారు. మంగళవారం గుల్లిపాడు, దోసలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు గ్రామాలను సందర్శించి, క్షేత్రస్థాయిలో రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపరచుకోవాలన్నారు.

## 90వ వార్డులో కార్పొరేటర్‌ పర్యటన

**ప్రజాశక్తి-గోపాలపట్నం** : జివిఎంసి 90వ వార్డు పరిధి సుసర్ల కాలనీ, జోగారావు వీధిలో వార్డు కార్పొరేటర్‌ బొమ్మిడి రమణ పర్యటించారు. కాలనీలోని సమస్యలను ప్రజలనడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం వేసిన రోడ్లు, కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయని, యుజిడి పనులను పట్టించుకోవటం లేదని స్థానికులు చెప్పారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేలా కృషిచేస్తానని రమణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పిల్లల మాణిక్యం, కర్మిజ్జి రమణ, జ్యోతి పాల్గొన్నారు.

## విఆర్‌పిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి- కోటవురట్ల** : కూలీలకు ఉపాధి కల్పనలో వివక్ష చూపుతున్న రామచంద్రపురం ఉపాధి హామీ విఆర్‌పి నాగలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు లింగన్ననాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం కూలీలతో కలిసి వెళ్లి, ఉపాధి హామీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన శివ గ్రూపు కూలీలకు ఉపాధి పనికల్పనలోనూ, మస్తర్ల నమోదులో రాజకీయ దురుద్దేశ్యంతో విఆర్‌పి వ్యవహరిస్తున్నారని, దీనిపై సమగ్ర పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే పిడి, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్‌ నాయకులు జనార్ధన్‌, ఎంపిటిసి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేసిన టిడిపి నేతలు

# కూటమి వైఫల్యాలపై వైసిపి పుస్తకావిష్కరణ

నర్సీపట్నంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్‌

**ప్రజాశక్తి -కోటవురట్ల:** కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన సూపర్‌ సిక్స్‌ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వైసిపి మాజీ ఎమ్మెల్సీ డి సూర్యనారాయణరాజు ఆరోపించారు. సోమవారం తమ క్యాంపు కార్యాలయం వద్ద కూటమి పాలన వైఫల్యంపై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది ఇవ్వాల్సిన అన్నదాత సుఖీభవ నిధులను కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టిందని, వాటిని వెంటనే చెల్లించాలన్నారు. సూపర్‌ సిక్స్‌ అమలులో భాగంగా మహిళలకు ఉచిత ఆర్‌టిసి ప్రయాణం, 18-59ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 చెల్లింపు, నిరుద్యోగభృతి ఇతర హామీల అమలేమైందని ప్రశ్నించారు.కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్‌ అనిల్‌ కుమార్‌, ఎంపిటిసి సభ్యులు రాంబాబు, రమేష్‌, సత్యనారాయణ రాజు, కన్నబాబు పాల్గొన్నారు.

**నర్సీపట్నం టౌన్‌** : సూపర్‌ సిక్స్‌ పథకాల అమలులో వైఫల్యంతో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే పి.ఉమాశంకర్‌ గణేష్‌ అన్నారు. సోమవారం వైసిపి క్యాంపు కార్యాలయంలో జగన్‌ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణేష్‌ మాట్లాడుతూ చంద్రబాబు ఏడాది పాలనలో అరాచకాలు, అక్రమ కేసులు, దాడులు తప్ప చేసిందేమీ లేదన్నారు. వైసిపి పాలనలో అర్హతే ప్రాతిపదికన రాజకీయాలకు అతీతంగా పథకాలను అమలు చేశామన్నారు.

**చోడవరం** : కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై ముద్రించిన 'జగన్‌ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని సోమవారం మాజీ మంత్రి, టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి గుడివాడ అమర్నాథ్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనంతా పగ, ప్రతీకారంతో సాగుతుందని, ఏడాదికాలంగా హామీలను అమలు చేయకుండా కాలం వెలదీస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జడ్పిటిసి దొండా రాంబాబు, వైసిపి నాయకులు పుల్లేటి వెంకటేష్‌, ఏడువాక సత్యారావు, ముక్క మహాలక్ష్మి నాయుడు, రాజు, కొల్లిమల్ల అచ్చంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**దేవరాపల్లి** : 'జగన్‌ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని మండలంలోని తారువ గ్రామంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, వైస్‌ ఎంపీపీ పంచాడ సింహాచలం నాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు బూరె బాబురావు, లలిత నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

విశాఖలో పుస్తకావిష్కరణలో కెకె.రాజు

**సబ్బవరం** : మండలంలోని వైసిపి కార్యాలయంలో అన్నంరెడ్డి అదీప్‌ రాజ్‌ ఆధ్వర్యంలో "జగన్‌ నమ్మకం-చంద్రబాబు మోసం" పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బైలపూడి భగవాన్‌ జయరాం, బోకం రామునాయుడు, గండి రవికుమార్‌, ఉప్పిలి కనకరాజు, వనం అచ్చం నాయుడు, కొటాన రాము, పరవాడ జడ్పీటీసీ పైలా సన్యాసి రాజు,సబ్బవరం సర్పంచ్‌ దెద్దం ప్రసాద్‌ పాల్గొన్నారు.

**విశాఖ కలెక్టరేట్‌** : 'జగన్‌ అంటే నమ్మకం.. బాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆశీలుమెట్ట కార్యాలయంలో వైసిపి శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌ కుమార్‌ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నా జానకిరామ్‌, బిపిన్‌ కుమార్‌ జైన్‌ పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి స్మారక భవనానికి
# రూ.లక్ష విరాళం



గంగారావుకు విరాళం అందజేస్తున్న స్వతంత్రకుమార్, రాణి ప్రమీల

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:** సీతారాం ఏచూరి స్మారకార్థం పిఠాపురం కాలనీ లో నిర్మిస్తున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయానికి కొసరాజు స్వతంత్ర కుమార్, సతీమణి రాణి ప్రమీల రూ.లక్ష విరాళంగా అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావుకు విరాళం చెక్కును సోమవారం అందజేశారు.గతంలో విశాఖలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి కూడా వీరు రూ.5 లక్షలు విరాళం అందించారు. వీరిది కమ్యూనిస్టు కుటుంబం.స్వతంత్ర కుమార్ గతంలో సిపిఎం ఉమ్మడి విశాఖ జిల్లా కమిటీ లో సభ్యుడు గాను, విశాఖ పోర్ట్ లో సిఐటియు యూనియన్ అధ్యక్షుడిగా దీర్ఘ కాలం పనిచేశారు. విశాఖ జిల్లాలో కార్మికులను సంఘటితం చేయడంలో కీలక పాత్ర పోషించారు. లయన్స్ వంటి అనేక సేవాసంస్థల్లో భాగస్వామిగా సేవలందిస్తున్నారు. రాణి ప్రమీల నీటి పారుదల శాఖలో టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు.విరాళ దాతలకు సిపిఎం విశాఖ జిల్లా కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

## ఎసిఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా శ్రీనివాస్

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్** :ఆల్ కమ్యూనిటీ ఫెడరేషన్ (ఎసిఎఫ్) పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షునిగా విశాఖ నగరానికి చెందిన ఉరికూటి శ్రీనివాసరావు నియమితులయ్యారు.ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు దాసరి రాంబాబు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే,తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షునిగా రామ్ సహాయం జయ సింహారెడ్డి (ఖమ్మం జిల్లా) నియమితులయ్యారు. కాగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన ఉరుకూటి శ్రీనివాసరావుకుపలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, పార్టీ జాతీయ కార్యాలయం విశాఖలోనే ఉండడం విశేషం అన్నారు. ప్రజల సంక్షేమానికి తమ పార్టీ అహర్నిశలు కృషి చేస్తుందన్నారు.

## 27న జగన్నాథస్వామి రథయాత్ర

**ప్రజాశక్తి- మాడుగుల** : మండల కేంద్రంలోని అతి పురాతన జగన్నాథ స్వామి ఆలయంలో రథోత్సవం ఈ నెల 27 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు పండా నూకరాజు, జరుగుబిల్లి శాస్త్రి తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా 27న స్వామి తొలి రథయాత్ర ప్రారంభం అవుతుందని, వచ్చేనెల 6న తొలి ఏకాదశి ఆదివారం వరకు స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బొడ్డేటి ఆదినారాయణ(స్వామి) కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 19న మరిడిమాంబ పండగ

**ప్రజాశక్తి- మాడుగుల** : మాడుగుల శివారు ఖండివరం వెళ్లే దారిలో మరిడిమాంబ అమ్మవారి పండుగను ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మాడుగుల మోదకొండమ్మ జాతర అనంతరం ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తున్న ఈ వేడుకలో భాగంగా ఈనెల 15వ తేదీన మరిడిమాంబ పండగ చాటింపు నిర్వహించారు. 17న మంగళవారం ఉదయం అమ్మవారి శతకం పట్టు వద్ద కొలువుంచుతారు. 19న పండగ రోజున తిరిగి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

# అటవీ భూములకు సాగుహక్కు పట్టాలివ్వాలి

- జిల్లా కలెక్టరేట్, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద గిరిజనుల ధర్నా

సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న గిరిజనులు

**ప్రజాశక్తి-గొలుగొండ** : అటవీ భూములకు హక్కు పట్టాలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో గొలుగొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ మండలంలో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు వారి పేరున సాగు నమోదుచేసి, అటవీ హక్కుల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి దళిత, గిరిజనులు సాగులో ఉన్నా అధికారులు సాగును గుర్తించకపోవడం బాధాకరమన్నారు. దీంతో రైతులు హక్కులను కోల్పోతున్నా రన్నారు .కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, సిపిఎం మండల కార్యదర్శి టి.రాజు బాబు, ఎం.శివ, బి.గంగరాజు, లక్ష్మణ రావు, జి.శివ, భూషణం పాల్గొన్నారు.

**నక్కపల్లి** : మండలంలో పెద్దదొడ్డిగల్లు రెవెన్యూ పరిధిలో ఎన్నో ఏళ్ల నుండి సాగు చేసుకుంటున్న రైతులకు న ర్వే నెం బ ర్ - 1 లో ని భూములను పట్టాలు ఇవ్వాలని పంచాయతీ సర్పంచ్ గొర్ల విజయలక్ష్మి కుమారి డిమాండ్ చేసారు. సోమవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో పిజిఆర్‌ఎస్‌లో వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, సర్పంచ్ విజయలక్ష్మి కుమారి, నాగ అప్పలరాజు ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు .పెద్దదొడ్డిగల్లు రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్-1 లో 334 ఎకరాల భూమిని కొన్నేళ్లుగా గ్రామానికి చెందిన పలువురు రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే ఆ భూమిని కొందరు దళారులు, పెద్దలు, అధికారులు కలిసి అన్యాక్రాంతంగా ఆ భూములను ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దళారుల ప్రయత్నాలను తిప్పికొట్టి, సాగులో ఉన్న రైతులకు పట్టాలిచ్చి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద దొడ్డిగల్లు, సీతంపాలెం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్నగిరిజనులు

# కలుషిత ఆహార బాధితులకు పరామర్శ

- పాడేరు మోదమ్మ దర్శనంలో పులిహోరా ప్రసాదం తినడంతో అస్వస్థత

బాధితులను పరామర్శిస్తున్న స్పీకర్ సతీమణి పద్మావతి

**ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్** : పాడేరు మోదమాంబ ఆలయ దర్శనానికి వెళ్లిన అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు చెందిన 15 మంది గిరిజనులు శనివారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు.కాకినాడ జిల్లా వాసులు తీసుకువచ్చిన పులిహోర తినడంతో అస్వస్థతకు లోనైనట్లు బాధితులు తెలిపారు. ఆదివారం పాడేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స పొందారు. అనంతరం నర్సీపట్నం ఏరియాఆసుపత్రికి కొందరిని తరలించారు. సోమవారం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాతవరం మండలం అసనగిరికి చెందిన 13 మంది బాధితులను స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి నర్సీపట్నం కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. అవసరమైన వైద్యం తక్షణమే అందించాల్సిందిగా వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. బాధితుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. మిగిలిన 12 మంది ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఒ డాక్టర్ జ్యోతి పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.

## కెజిహెచ్ న్యూరో సర్జరీ విభాగానికి
## రూ.8 లక్షల పరికరాల వితరణ

సర్జరీ పరికాలను అందజేస్తున్న దాతలు

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:** విశాఖ కెజిహెచ్ న్యూరోసర్జరీ విభాగానికి డాక్టర్ సుంకర బాల పరమేశ్వరరావు కుమార్తె సుంకర ఆదిలక్ష్మి రూ.8 లక్షల విలువైన ఆపరేషన్ థియేటర్ పరికరాలను విరాళంగా అందించారు. న్యూరోసర్జరీకి పితా మహుడిగా కీర్తిపొందిన సుంకర బాలపరమేశ్వరరావు జ్ఞాపకార్థం వీటిని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి అందజేశారు. ఈ సందర్భంగ డాక్టర్ వాణి మాట్లాడుతూ, సర్జరీ విభాగానికి ఒటి పరికరాలు వితరణగా ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. న్యూరోసర్జరీ విభాగానికి ఎంతగానో ఉపయోగపడు తుందన్నారు. రోగులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి వీలవుతుందన్నారు. న్యూరోసర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ప్రేమ్‌జిత్ రే, న్యూరోసర్జరీ ప్రొఫెసర్ డాక్టర్.బి.హయగ్రీవరావు, ఇతర వైద్యులు, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్‌జి.మోహర్ కుమార్, అనస్థీషియా విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ వి.రవి పాల్గొన్నారు.

# కేన్సర్‌పై మహిళలకు అవగాహన

**ప్రజాశక్తి- పాయకరావుపేట** : వికాస తరంగిణి ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య వికాస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మహిళలకు గర్భాశయ, రొమ్ము కేన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మమత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ పుష్ప రమ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు గణశాల రామన్నదొర జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి ఆయన కుమారులు నూకరాజు, వెంకటేశ్వరరావు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గుటూరు రామగోవిందు, కోనే పుత్రయ్య, దేవవరపు ఆనంద్, కోనే కొండబాబు, దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ కట్టా వీరబాబు, నీలాపు వెంకటరెడ్డి, వికాస తరంగిణి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మహిళలను పరీక్షిస్తున్న వైద్యులు

## చంద్రబాబు సమావేశానికి తరలిన నేతలు

సిఎం సమావేశానికి వెళుతున్న టిడిపి నేతలు,

**ప్రజాశక్తి- పాయకరావుపేట** : విశాఖపట్నంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహిస్తోన్న సమావేశానికి పాయకరావుపేట నుంచి పెద్ద సంఖ్యలో టిడిపి కేడర్ తరలి వెళ్లింది. పార్టీ మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్ (పద్దు), టౌన్ ప్రెసిడెంట్ యాళ్ల వరహాలబాబు, మాజీ పార్టీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు ఆధ్వర్యంలో వీరంతా విశాఖపట్నం వెళ్లారు.

# సిడిపిఒగా రమణి

సిడిపిఒ రమణి

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్** : నర్సీపట్నం ఐసిడిఎస్ సిడిపిఒగా రమణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ సిడిపిఒగా పనిచేసిన సువార్త అనకాపల్లికి బదిలీ అయ్యారు. రమణి చింతపల్లి నుంచి బదిలీపై నర్సీపట్నం వచ్చారు. గతంలో నర్సీపట్నంలో పనిచేసిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా రమణి మాట్లాడుతూ అంగన్వాడీల కేంద్రాల్లో పిల్లలకు, మహిళలకు సంపూర్ణ పౌష్టికాహారం అందించడానికి కృషి చేస్తామన్నారు. సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తానన్నారు. ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్వాడీలు సహకరించాలని కోరారు.